రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- రైతు భరోసా రెండో విడత చెక్కుల పంపిణీ
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



బుట్టాయగూడెంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆ దిశగానే రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రైతు భరోసా రెండవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ నాడు టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అనే పరిస్థితి ఉండేదని, ఆ స్థితిని మార్చుతూ నేడు వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. రైతే దేశానికి వెన్నుముఖ అని నమ్మి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విత్తు నుంచి పంటను అమ్మేంత వరకు ప్రతి దశలోనూ రైతుకు అండగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పాలనలో రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని, ఈ పాలన ఇలాగే కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో రైతులకు రెండవ విడత రైతు భరోసా చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతిరమణ, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అరేటి శాంతికుమారి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపీపీలు, గుగ్గులోతు మోహన్‌రావు, కుక్కల వరలక్ష్మి, స్థానిక సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, సొసైటీ అధ్యక్షుడు అరేటి సత్యనారాయణ, కోకన్వీనర్ సోదేం సుధాకర్, కో‌ఆప్షన్ షేక్ బాజీ, సచివాలయం మండల కన్వీనర్ తెల్లం సింహాచలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఆంధ్రా కాలువకు మంచి రోజులు



చింతలపూడి మండలంలోని ఆంధ్రా కాలువ ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న దృశ్యం



తెలంగాణ–ఆంధ్రా సరిహద్దు తుమ్మూరు వద్ద ఏలూరు జిల్లాలోకి వరద నీరు విడుదల చేయడానికి నిర్మించిన గేట్లు

- కాలువ అభివృద్ధికి నిధుల మంజూరు
- రూ.50 లక్షల మంజూరుకు కలెక్టర్ అంగీకారం
- హర్షం వ్యక్తం చేస్తున్న మెట్ట ప్రాంత రైతులు

చింతలపూడి: ఆంధ్రా కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడానికి జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అంగీకరించడంతో మెట్ట ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఆంధ్రా కాలువ ఆయకట్టు రైతులు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆంధ్రా కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆంధ్రా కాలువ అభివృద్ధికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయడానికి ఆయన అంగీకరించారు. త్వరలోనే ఇరిగేషన్ అధికారులు కాలువ మరమ్మతులకు అవసరమైన ఎస్టిమేట్లు తయారు చేస్తారని రైతులు తెలిపారు.

చివరి పొలాలకు నీరు అందక..

ఆంధ్రా కాలువను మరమ్మతులు చేయాలని రైతులు చాలా కాలంగా విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువ పూడుకుపోవడంతో చివరి పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పాలకులకు రైతులకు అవసరమైన సాగునీటి కాలువలు, చెరువులు బాగు చేసుకుందామన్న ఆలోచన లేనేలేదని చెప్పవచ్చు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో నీరు, మీరు పథకంలో చెరువుల పూడికతీత పనులు చేపట్టినా చెరువులు అభివృద్ధి చెందకపోగా తెలుగు తమ్ముళ్ల జేబులు నింపడానికే ఉపయోగపడింది. చింతలపూడి నియోజకవర్గంలోని రాఘవాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలో ఉన్న ఆంధ్రా కాలువ పూడుకుపోయి దశాబ్దాలు కావస్తోంది. దీంతో ఏటా కురిసిన వర్షాలకు వరద నీరు పంటపొలాలపై నుంచి ప్రవహించి వృథాగా పోతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు నుంచి మన జిల్లాలోకి వచ్చే ఆంధ్రా కాలువ క్రింద మండలంలో 21 చెరువులకు సాగు నీరు అందుతుంది. దాదాపు 15 వేల ఎకరాలు సాగు అవుతోంది. ఆంధ్రా కాలువ అభివృద్ధికి కలెక్టర్ నిధుల మంజూరు అంగీకారం తెలపడంతో రైతుల కష్టాలు తీరనున్నాయి.

ఎంపీ, కలెక్టర్‌లకు కృతజ్ఞతలు



ఆంధ్రా కాలువ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం శుభ పరిణామం. దశాబ్దాలుగా తెలంగాణ నుంచి ఆంధ్రాలోకి వరద నీరు వచ్చే ప్రధాన కాలువ పూడుకుపోయింది. ఆంధ్రా కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయించడానికి కృషిచేసిన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబుకు, జిల్లా కలెక్టర్‌లకు కృతజ్ఞతలు.

– గిరి భోగారావు, ఆయకట్టు రైతు, రాఘవాపురం

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలి



రైతుల నుంచి వినతిపత్రం అందుకుంటున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

చింతలపూడి: మెట్టప్రాంత రైతుల సాగు నీటి కష్టాలు తీర్చే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరీ ప్రచార యాత్ర మంగళవారం చింతలపూడి చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల రైతుల సమస్యలను పరిష్కరించి, భూసేకరణ పూర్తి చేసి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: వర్షాలు లేక పంట సాగులో నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజారక్షణభేరి బస్సు యాత్ర మంగళవారం జంగారెడ్డిగూడెం చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక సీపీఎం మండల కమిటీ కార్యదర్శి మానుకొండ జీవరత్నం అధ్యక్షతన బస్టాండ్ వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాకార్మిక సమస్యల పరిష్కారం అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణభేరి బస్సు యాత్ర జరుగుతుందన్నారు.

టి నరసాపురం: ప్రతి పేద కుటుంబానికి 2 ఎకరాలు భూపంపిణీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర మంగళవారం మండలం మీదుగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక సొసైటీ వద్ద మండల సీపీఎం కార్యదర్శి అనుమోలు మురళి ఆధ్వర్యంలో బస్సు యాత్రలో నాయకులకు ఘన స్వాగతం పలికారు. బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

కొయ్యలగూడెం: సీపీఎం ప్రజారక్షణభేరి మంగళవారం కొయ్యలగూడెం చేరుకుంది. అసమానతలు లేని సమాజం, అభివృద్ధి కోసం సీపీఎం పోరాడుతుందని రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసురావు అన్నారు.

ముమ్మరంగా రహదారి అభివృద్ధి పనులు



శివపురం – పోతునూరు రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నీరజా సుధాకర్

చింతలపూడి: మండలంలోని శివపురం – పోతునూరు రహదారి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మంగళవారం జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజా సుధాకర్ ఈ రహదారి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివపురం గ్రామం నుంచి మల్లేశ్వరం, ఎండపల్లి, శివపురం నుంచి పోతునూరు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారుకు సూచించారు. గత రెండు దశాబ్దాలుగా ఈ రహదారులు అభివృద్ధికి నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా సమాంతరంగా జరుగుతున్నట్లు తెలిపారు.

నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కేంద్ర సహకార శాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్ శ్రీనివాస్

చింతలపూడి: సహకార సంఘాలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా సిబ్బంది, సహకార సంఘల పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర సహకారశాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్ శ్రీనివాస్ అన్నారు. చింతలపూడి డీసీసీబీలో బుధవారం రెండో రోజు జిల్లాలోని 20 సహకార సంఘ సీఈఓలు, పాలకవర్గ సభ్యులకు సహకార సంఘాల బలోపేతంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల పోటీని తట్టుకొని సహకార సంఘాల్లో లాభాలు పెంచాలన్నారు. పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు గురి కాకూడదన్నారు. సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. సభ్యులు సరళతరమైన రుణ విధానాన్ని, రుణ పంపిణీ విధానాన్ని అవలంబించాలన్నారు. రైతులకు మద్దతు ధర లభించే విధంగా, వినియోగదారులకు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందించేందుకు సహకార సంఘాలు ప్రాసెసింగ్, మార్కెటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే మహిళా డైరీ సహకార సంఘాలు బలోపేతం చేయాలని, పాల ఉత్పత్తిదారుల సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. ఈ సదస్సులో నూజివీడు డివిజనల్ సహకార అధికారి ఎం.మోహన్‌బాబు, సబ్ డివిజనల్ సహకార అధికారి పి.విజయకుమారి, వివిధ సహకార సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా డైరీ సహకార సంఘ ప్రతినిధులు, చింతలపూడి సహకార బ్యాంకు మేనేజర్, సిబ్బంది, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థల బంద్



కొయ్యలగూడెంలో బంద్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొయ్యలగూడెం: విద్యార్థి సంఘాల పిలుపుమేరకు బుధవారం రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బంద్ గోడపత్రికలను విద్యార్థి నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ అయిన వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కారు చౌకగా ఆదానికి అమ్మే ప్రయత్నాలు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల మణిహారంగా పిలవబడుతున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను అమ్మడం కార్పొరేట్ దారుల చేతుల్లో తాకట్టు పెట్టడమే అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్ల గడుస్తున్నా విభజన హామీలను అమలు చేయకపోవగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నించడం హేయమైన చర్య అని అనాసరు. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు పెద్ద ఎత్తున సహకరించి బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కె.రాజు, జి.ఉదయ్, ఎ.ఇందు, వి.ప్రేమ్, కె.వెంకట్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం లోపంతోనే మాతాశిశు మరణాలు



చింతలపూడి: సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మధుబాబు



జంగారెడ్డిగూడెం: న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: పౌష్టికాహారం లోపంతోనే మాతా శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జ్ సి.మధుబాబు అన్నారు. మంగళవారం చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో పిల్లల సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్న పిల్లల పెంపకంలో తీసుకోవలసిన సంరక్షణ మెళుకువలను గురించి సిబ్బందికి, తల్లితండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి మధుబాబు మాట్లాడుతూ ఎంతో మంది గర్భిణీగా ఉన్నప్పుడు తగిన సూచనలు పాటించక పురిటిలోనే బిడ్డలను కోల్పోతున్నారన్నారు. తల్లితండ్రులు పిల్లలపై శ్రద్ధ చూపించక ఏడాదిలోపు పిల్లలు మరణిస్తున్నారని కేవలం పౌష్టికాహార లోపంతోనే ఇది జరుగుతుందని, అలాగే గ్రామాలలో ఆశ వర్కర్స్ ద్వారా, అంగన్‌వాడీ ఉద్యోగుల ద్వారా, హాస్పిటల్ సిబ్బంది ద్వారా కడుపుతో ఉన్న మహిళలకు పౌష్టికాహార విలువలు తెలియజేయాలనేదే ఈ న్యాయ విజ్ఞాన సదస్సు ఉద్దేశమన్నారు. చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారిని కాపాడుకుని రేపటి తరానికి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని, ఇప్పటికే ప్రభుత్వాలు ఎంతో పౌష్టికాహారం నిమిత్తం ఖర్చు పెడుతుందని తెలిపారు. ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను మంచి ఆరోగ్యంగా పెంచాలని, పీసీపీఎన్‌డీటీ చట్టం ద్వారా గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదని ఎవరైనా అతిక్రమిస్తే శిక్షకు గురవుతారని తెలిపారు. ఇందులో హాస్పిటల్ సూపరింటెండెంట్ హాఫీజా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలాకుమారి, ఎయిడ్స్ కౌన్సిలర్ నిమ్మగడ్డ అశోక్ బాబు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు శిశు రక్షణా దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ అప్పుడే పుట్టినటువంటి శిశువులు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉండాలని ప్రతి తల్లి, కుటుంబంలోని ప్రతి ఒక్కరు కోరుకుంటారన్నారు. కానీ తల్లిదండ్రులకు నవజాతి శిశువులను రక్షించుకొనుటకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఈరోజు ముఖ్యంగా నవజాతి శిశు మరణాల రేటు తగ్గించడానికి, శిశువులో రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బార్ సెక్రెటరీ ఏవీవీ భువనేశ్వరి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ రాంబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ వి.సామ్రాజ్యం, బార్ మెంబర్స్ ఎం.క్రాంతికుమార్, బల్లే సాయి కుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన భాగవత సప్తాహం



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: స్థానిక అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మశ్రీ ఇనుగంటి ఉమా రామారావు పర్యవేక్షణలో మహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మచే ఏడు రోజుల పాటు భాగవత సప్తాహం అత్యంత వైభవంగా నిర్వహించారన్నారు. దీనిలో భాగంలో చివరి రోజు మంగళవారం ఆలయంలో కార్యక్రమాలు ఘనంగా జరిపించారు. పూర్ణాహుతి నిర్వహించిన అనంతరం బృందావన దర్శనం, గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకోవాలి



కొయ్యలగూడెంలో మాట్లాడుతున్న జమ్మి శ్రీనివాస్

కొయ్యలగూడెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ జమ్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గత వెయ్యి రోజులుగా నిరాహార దీక్ష నిర్వహిస్తుంటే కేంద్ర ప్రభుత్వంలో కనీసం చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 32 మంది ఆత్మబలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం, కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు తీరని లోటును మిగులుస్తుందని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే బాజీ, లక్క లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కుక్కునూరు: వర్షాలు లేక, సాగుచేసిన పంటలకు నీరందక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకోవాలని సీపీఐ ఏలూరు జిల్లా సమితి కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య కోరారు. మంగళవారం కుక్కునూరు మండలంలో వర్షాలు లేక ఎండిపోయిన పంటలను సీపీఐ బృందం పరిశీలించింది.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: తడికలపూడిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్, జెడ్పీటీసీ కడిమి రమేష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో స్టాక్ రిజిస్టర్ అటెండెన్స్, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించి, అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో అనేక సదుపాయాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగపరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీల, అంగన్‌వాడీ టీచర్ పద్మ, పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకును పండించాలి



పర్యావరణ మిత్ర బ్యాగులను ప్రదర్శిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పొగాకు పంటకు ఉన్న డిమాండ్ దృష్ట్యా నాణ్యమైన పొగాకు పండించాలని ఎన్ఎల్ఎస్ రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య రైతులకు సూచించారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని వర్జీనియా పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ప్రస్తుతం ఉన్న సాగు సమస్యలపై కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వేలం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరేట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మేనేజర్ (విస్తరణ విభాగం) జి.దామోదర్ మాట్లాడుతూ తక్కువ ఎకరాల్లో ఎక్కువ దిగుబడి సాధించటానికి కృషి చేయాలన్నారు. పర్యావరణ మిత్ర హిత బ్యాగులని వాడాలని సూచించారు. ఈ సందర్భంగా జూట్‌తో తయారుచేసిన బ్యాగులను ప్రదర్శించారు. ఐటీసీ సైంటిస్ట్‌లు మాట్లాడుతూ నూతన పరిజ్ఞానాన్ని తెలియజేసి పొగాకు పంటకు వివిధ దశలలో ఎలా ఉపయోగపడుతుందో వివరించారు. బోర్డు అధికారులు రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు ‘200 రోజులు’ ర్యాలీ

టి.నరసాపురం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 200 రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 8వ తేదీన బుధవారం టి.నరసాపురం మండలంలో మోటార్ సైకిల్, కార్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు బొర్రంపాలెం అడ్డరోడ్డు నుంచి టి.నరసాపురం వరకు మోటార్‌సైకిల్, కార్ల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం టి.నరసాపురంలో గడపగడపకూ 200 రోజుల సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పోలవరం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, అభిమానులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాలన

జంగారెడ్డిగూడెం రూరల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం వైఎస్సార్ రైతు భరోసా నిధుల విడదల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్ష ప్రసారాన్ని శ్రీనివాసపురం రైతు భరోసా కేంద్రంలో ప్రజాప్రతినిధులు, రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాలీ విత్ జీఎస్టీ కోర్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో టాలీ విత్ జీఎస్టీ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ కళాశాలలో మొత్తం విద్యార్థులలో 40 శాతం విద్యార్థులు కామర్స్ విద్యార్థులే అని వాళ్లకు ఎంతగానో ఉపయోగపడే టాలీ విత్ జీఎస్టీ సర్టిఫికెట్ కోర్సును కళాశాలలోనే నేర్పించడం మంచిదన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సు బయట నేర్చుకోవాలంటే చాలా ఖర్చవుతుందని అన్నారు. ఇక్కడ కామర్స్ విద్యార్థులందరూ దీన్ని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్తులో దీనిపై ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కామర్స్ విభాగం నుంచి సీహెచ్.రమాదేవి, కేవివి శిరీష, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.ఎం.మధు, రసాయన శాస్త్ర విభాగం నుంచి యు.వెంకటాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.